క్లుప్తంగా

గణిత దినోత్సవం



మహదేవపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్(బాలికల) పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకల్లో భాగంగా శనివారం గణిత దినోత్సవ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన వివిధ రకాల ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, ఎంపీటీసీ సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు సత్యం, ప్రకాశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మి ఫౌండేషన్ సేవలు ప్రారంభం



పలిమెల : మండల కేంద్రంలో జనగామ ప్రభాకర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ చేతుల మీదుగా రాజ్యలక్ష్మి ఫౌండేషన్ సేవలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు వివరించారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఎంపీడీఓ

మహాముత్తారం : శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థిని సహిలోహితితో పాటు కేజీబీవీ విద్యార్థిని సింధూజతో పాటు మరో ముగ్గురు బహుమతులు గెలుపొందారు. దీంతో శనివారం మండలకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, ఏపీఓ కుమారస్వామి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

బాలికల అక్రమ రవాణాను అరికట్టాలి

ఆత్మకూరు : బాలికల అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని సఖి కౌన్సిలర్ మాధవి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సఖి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. బాలికలు ఐసీడీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లావణ్య, పుష్పలీల, మమత తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

పరకాల : పరకాల ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొట్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జి.కుమార్, కోశాధికారిగా దామ క్రాంతి, ఉపాధ్యక్షుడిగా బొచ్చు భద్రయ్య, సహాయ కార్యదర్శిగా బొక్క రమేష్, కార్యవర్గ సభ్యులు జిల్లెల రజనీకాంత్, ఏకు ఈశ్వర్, మోరె సదయ్య ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతీయడం అన్యాయమని అన్నారు. ఆటో డ్రైవర్లకు న్యాయం జరిగేంత వరకు తాము ప్రభుత్వంతో కొట్లాడుతామని స్పష్టం చేశారు.

గుంతల రోడ్డుతో నరకం



దొంగలఒర్రె వద్ద ప్రమాదకరంగా ఉన్న ప్రధాన రోడ్డు



రైతువేదిక వద్ద కల్వర్టుపై ప్రమాదకరంగా మారిన రోడ్డు

- ప్రమాదకరంగా ప్రధాన రహదారి
- అధికారుల నిర్లక్ష్యం..ప్రజలకు శాపం

మంగపేట : కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వంతో రోడ్డు గుంతలుగా మారింది. నాసిరకంగా పనులు చేపట్టడంతో తారులేచి ప్రమాదకరంగా తయారైంది. మండలంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ఎన్‌హెచ్–163 నుంచి మండలంలోని బ్రాహ్మణపల్లి వరకు 34 కిలోమీటర్ల మేర ప్రధాన బీటీ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి నరకప్రాయంగా మారింది. మంగపేట–కమలాపురం గ్రామాల మధ్య గల దొంగల ఒర్రె బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతల కారణంగా అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోవడంతో ప్రజల ప్రాణాలంటే వారికి పట్టింపు లేదా? అని స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్ల కాలంలో రూ.కోట్లు ఖర్చు

గడిచిన మూడేళ్ల కాలంలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతల మరమ్మతులు, బీటీ రెనివల్ పనులకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా నాసిరకంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రతి ఏటా రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యానికి అమాయకులు బలి

ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో, రోడ్డు ప్రమాదం వల్ల ఎంతో మంది అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోయారు. మండలంలోని దొంగల ఒర్రె, గంపోనిగూడెం బీసీ హాస్టల్ సమీపంలోని కల్వర్టు, తెలంగాణ అమరవీరుల స్థూపం, తిమ్మంపేట సమీపంలోని పది తూముల మోరీ(కల్వర్టు), చుంచుపల్లి పీహెచ్‌సీ మూల మలుపు, పాలాయిగూడెం సమీపంలోని కల్వర్టు, రాజుపేట కెనరాబ్యాంక్ తదిర ప్రాంతాల్లో గడిచిన 18 నెలల కాలంలో నలుగురికి పైగా మృతి చెందారు. అనేక మంది గాయాలపాలయ్యారు.

నిధులు మంజూరై రెండేళ్లు

ఏటూరునాగారం ఎన్‌హెచ్–163 నుంచి మండలంలోని బ్రాహ్మణపల్లి వరకు (జిల్లా సరిహద్దు వరకు) గల 34 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులు, బీటీ రెనివల్ కోసం ప్రభుత్వం 2022, 2023 ఆర్థిక సంవత్సరంలో రెండు దఫాలుగా రూ.9.50 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా గత మే నెలలో హడావిడిగా ప్రారంభించి పూర్తి చేయకుండా మధ్యలోనే నిలిపివేశాడు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాసిరకంగా పనులు చేపట్టడంతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పాడ్డాయి. కమలాపురం, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్డుపై తారు లేచిపోయింది. ఇదే విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారులను ప్రశ్నిస్తే కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించలేదని మళ్లీ మరమ్మతు పనులు చేయిస్తామని సమాధానం ఇచ్చి, బిల్లులు చెల్లించడం విశేషం.

విచారణ చేపట్టాలి



కలెక్టర్ స్పందించి రోడ్డు మరమ్మతులు, బీటీ రెనివల్ పనులను టెండర్ ద్వారా పొందిన కాంట్రాక్టర్ గడువు ముగిసినా పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేసినందున వాటిని రద్దు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. అదే విధంగా మూడేళ్ల నుంచి రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం కేటాయించిన నిధులు ఎంత. పనులు ఎంత మేరకు చేపట్టారు, కాంట్రాక్టర్‌కు చెల్లించిన బిల్లులపై విచారణ చేయాలి. నాసిరకంగా పనులు చేసిన కాంట్రాక్టర్‌తో పాటు చేపట్టని పనులను చేసినట్లుగా తప్పుడు ఎంబీ రికార్డు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలి. మరమ్మతులు చేపట్టే విధంగా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి.

– తాటి విజయబాబు,
పెసా కమిటీ మండల నాయకుడు, మల్లూరు

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ములుగు : జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్ భవనంతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోరిక రాహుల్ నాయక్ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేస్తే ప్రజా సమస్యలను జర్నలిస్టులతో విన్నవించుకునేందుకు ఓ వేదికగా మారుతుందని అన్నారు. ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టులు కొన్నేళ్లుగా పోరాడుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పి, ఇచ్చిన హామీ అమలు చేయలేకపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు తక్షణ సాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

పలిమెల : కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ఇందారపు రవికుమార్ కోరారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా పలిమెల మండలం లెంకలగడ్డ, మోదేడు గ్రామాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు చేరాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఉపాధి కల్పన కోసం అనేక రకాలైన రుణాలను బ్యాంకులు అందిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాల గురించి ప్రజలకు అధికారులు వివరించారు. అనంతరం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాస్త్రవేత్త సాయికిరణ్, సీసీ.స్వామి, బ్యాంక్ అధికారి అనిల్, హెల్త్ డిపార్ట్‌మెంట్, అంగన్‌వాడీ టీచర్లు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు బాలకృష్ణ, రాజేష్, వీఓఏలు, ఆయా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

శివాలయ నిర్మాణం పూర్తి చేస్తాం



దర్వాజ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

దామెర : శివాలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తామని నిర్మాణ కమిటీ చైర్మన్ బిల్లా రమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక శివాలయం పునర్నిర్మాణంలో భాగంగా దర్వాజ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య దర్వాజ ప్రతిష్ఠించిన అనంతరం కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. వచ్చే మహా శివరాత్రిలోగా శివాలయం నిర్మాణం పూర్తిచేసి, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తామని అన్నారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శివాలయం నిర్మాణం కోసం గ్రామానికి చెందిన మేరుగు కుమార్ రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ పోలం కృపాకర్ రెడ్డి, పీపీ అనిల్‌రెడ్డి, మాజీ పీపీ గంగిడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాజయ్య, సదిరం పోషయ్య, దుర్శెట్టి భిక్షపతి, సోనబోయిన రవి, బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, దామెరుప్పుల శంకర్, కొమ్మాలు, రాజకొమురయ్య, బాలరాజు, చేరాలు, ప్రశాంత్ రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూర్ గ్రామానికి చెందిన గర్భిణి గడ్డం సంధ్యారాణికి శనివారం సాయంత్రం పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. ఈ మేరకు అంబులెన్స్‌లో ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ములుగు ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. 108వాహనంలో సంధ్యారాణిని ములుగు తరలిస్తుండగా మార్గమధ్యలో తాడ్వాయి సమీపంలో పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ నాగరాజు, పైలట్ దశరథం వాహనం పక్కకు నిలిపి పురుడుపోశారు. దీంతో సంధ్యారాణి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ నాగరాజు తెలిపారు. తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వారు అన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బియ్యం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ములుగు రూరల్ : మండలంలోని సర్వాపూర్ పంచాయతీ పరిధి జగ్గన్నగూడెం గ్రామానికి చెందిన ఈసం రాజబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను శ్రీరామకృష్ణ సేవా ట్రస్టు సభ్యులు పరామర్శించారు. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా గుండబోయిన రవిగౌడ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి చేయూతదనందిచేందుకు ట్రస్టు అన్ని విధాల సహకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో శ్రీహరి, ఐలయ్య, కుమార్, లక్ష్మయ్య, జయరవి, శోభన్, అశోక్, పాపయ్య, సారంగం, శ్రీకాంత్, లింగస్వామి, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి

పరకాల : నిరంతర సంస్కరణశీలిగా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు దేశచరిత్రలో చిరస్థాయిగా నిలిచిన గొప్ప మహనీయుడని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పీవీ వర్ధంతి సందర్భంగా పరకాల అమరధామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఏకు రాజు, బీఆర్ఎస్ నాయకులు మార్క రఘుపతి గౌడ్, బండి సదానందం గౌడ్, బండి వెంకటేష్, ఎండీ అల్తాఫ్, రత్న శైలేందర్, ఏరుకొండ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న రైతులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం జాతర సందర్భంగా ప్రతి ఏటా రెండో పంట సాగు చేయకుండా నష్టపోతున్నామని తమకు నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరారు. శనివారం మండలంలోని నార్లాపూర్ గ్రామంలో వారు మాట్లాడుతూ.. వర్షాకాల సీజన్‌లో జంపన్నవాగు వరదలకు పంట పొలాలు నీట మునిగి నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే జాతర సమయంలో యాసంగి పంట సాగు చేయకుండా జాతర అవసరాలకు వదిలేస్తున్నామన్నారు. వర్షాకాలంలో వరదలకు, జాతర సమయంలో పంట సాగు చేయకుండా రెండు విధాలుగా తాము నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంట భూముల్లో భక్తులు విడిది చేయడంతోపాటు చెత్తచెదారం, గాజు సీసాలు పడేయం, తాత్కాలికంగా మరుగుదొడ్లు నిర్మించడంతో వాటిని పూడ్చేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ. 20వేల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి సీతక్క ఈ విషయంలో చొరవ చూపాలని కోరారు. ఈసమావేశంలో రైతులు ఎనగంటి భద్రయ్య, బాలయ్య, సమ్మయ్య, దుర్గయ్య, రాజు పాల్గొన్నారు.

‘నో బ్యాగ్ డే’ నిర్వహించాలి

- డీసీఈబీ సెక్రటరీ విజయమ్మ



విద్యార్థులతో విజయమ్మ, ఉపాధ్యాయులు

ములుగు : పాఠశాలల్లో విధిగా నాల్గోవ శనివారం నో బ్యాగ్ డే నిర్వహించాలని డీసీఈబీ సెక్రటరీ ఎన్నం విజయమ్మ సూచించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. విద్యార్థులను సందర్శనార్థం పోస్టాఫీస్‌కు తీసుకెళ్లారు. పోస్టల్ పిన్‌కోడ్ ప్రాముఖ్యత, ఆధార్‌సెంటర్ పనితీరు, పోస్టాఫీస్‌లో సిబ్బంది విధులు, ప్రతిఏటా మహనీయుల ఫొటోలతో విడుదల చేసే పోస్టల్ స్టాంపులపై పోస్ట్ మాస్టర్ ప్రశాంత్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ నాల్గోవ శనివారం షెడ్యూల్‌ను అనుసరించి సహబోధన కార్యక్రమాలు, క్షేత్ర స్థాయి పర్యటనలకు తీసుకెళ్లి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో మరచిపోలేని అనుభూతి కలుగుతుందని తెలిపారు. ఎన్నో విషయాలను నేరుగా చూడడం ద్వారా భవిష్యత్‌లో ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిట్టల మల్లయ్య, చంద్రమౌళి, మమత, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ఏటూరునాగారం: కేక్ కట్ చేస్తున్న టీఎన్జీఓస్ నాయకులు

ఏటూరునాగారం : టీఎన్జీఓస్ జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి పోలురాజు పాల్గొని ఉద్యోగస్తులకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచారు. కోశాధికారి లాల్‌నాయక్, వైస్ ప్రెసిడెంట్ కుమారస్వామి, మహిళా ఉద్యోగుల అధ్యక్షులు చైతన్య, జాయింట్ సెక్రెటరీ శ్రీధర్ రావు, ములుగు యూనిట్ కార్యదర్శి ప్రదీప్, శ్రీవాణి, రఘు ప్రసాద్, రాంగోపాల్, రమేష్ సౌమ్యరెడ్డి, జయసింత, ఇందిరా, కవిత, వర్ష, జయ, రజిని, రమ, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

కాటారం : మండల కేంద్రంలోని వివేకానంద, మాంటిస్సోరి పాఠశాలల్లో శనివారం ముందస్తు నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఆకట్టుకున్నాయి. వివేకానంద పాఠశాల విద్యార్థి తూర్పటి అనిల్ క్రిస్మస్ తాత వేషధారణలో అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కనుల విందుగా సాగాయి. ఈ సందర్భంగా వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ వలుస వెంకటేశ్వర్లు, మాంటిస్సోరి డైరెక్టర్ కామిటి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. యేసు బోధనలు ప్రపంచ శాంతికి ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. భగవంతుడిని ఆరాధించుటకు అనేక మార్గాలు ఉన్నాయని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా పండుగలను జరుపుకోవడం భారతదేశ గొప్పతని తెలిపారు. ప్రిన్సిపాల్ వలుస వందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కరోనాపై విద్యార్థులకు అవగాహన



ప్రగళ్లపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు



పెద్దగొళ్లగుడెంలో..

వాజేడు : కరోనా వైరస్ సోకకుండా ముందు జాగ్రత్తగా విద్యార్థులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యులు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని పెద్దగొళ్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాల, ప్రగళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. విద్యార్థులకు దగ్గు, జలుబు, జ్వరం, తలనొప్పి ఉంటే వెంటనే ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు మాస్క్ ధరించడం తప్పని సరి అని సూచించారు. కార్యక్రమంలో జ్ఞానస, స్రవంతి ఉన్నారు.

సబ్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ

మల్హర్: మండలంలోని తాడిచర్లలో సబ్ సెంటర్ నిర్మాణానికి, తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో మెడికల్ ఆఫీసర్ నివాస సముదాయ నిర్మాణానికి ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, జెడ్పీటీసీ అయిత కోమల రాజిరెడ్డి శనివారం భూమిపూజ నిర్వహించారు. సబ్ సెంటర్(ఆరోగ్య ఉప కేంద్రం) రూ.15.75 లక్షలు, మెడికల్ ఆఫీసర్ క్వాటర్ ను రూ.15.75 లక్షల వ్యవయంతో నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, వైద్యాధికారి రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ తిరుపతిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ మల్హల్‌రావు

అయ్యప్ప ఆలయంలో దివ్య పడిపూజ

నర్సంపేట : పట్టణంలోని ధర్మశాస్త్రా అయ్యప్పస్వామి ఆలయంలో చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన దివ్య పడిపూజకు దాతగా దేవునూరి అంజయ్యగుప్తా కుటుంబ సభ్యులు వ్యవహరించగా ఆలయ ప్రధాన అర్చకుడు సి.వెంకటేశ్ శర్మ గురుస్వామి గర్భగుడి నుంచి పంచలోహ అయ్యప్పస్వామి విగ్రహాన్ని దాత శిరస్సుపై ధరించి ప్రదర్శన చేశారు. అనంతరం ధ్వజస్తంభం ఎదుట 18 పడిమెట్లపై స్వామివారికి పడిపూజ, కలశ పూజ, అభిషేక పూజ నిర్వహించారు. గీతాంజలి అమరేందర్, దాసి స్వప్న గోపి, ములుగు అశోక్, తాటికొండ శ్రీనివాస్, నర్సంపేటకు చెందిన శివసాయి రియల్ ఎస్టేట్, వజినపెల్లి సుష్మ విజయ్‌కుమార్, ఎఫ్ఎంసీజీ డిస్ట్రిబ్యూటర్లు నర్సంపేట, దుర్గం రాజమణి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర ట్రేడింగ్ కంపెనీ, భార్గవ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో స్వాములు, భక్తులకు అన్నదానం చేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గణపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని మైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పంటను కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా విక్రయించుకోవాలన్నారు. మధ్యవర్తులు, దళారుల చేతిలో మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు భూక్య సమ్మయ్య నాయక్, ముత్యాల రాజయ్య, వెంకటేశ్వరస్వామి, వరుణకుమారి పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఆజాంనగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించి మాట్లాడారు. దళారులు, మధ్యవర్తులతో పని లేకుండా రైతు భరోసా కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా పనిచేస్తాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, కమలాపూర్ మాజీ సర్పంచ్ తోట సంతోష్, నాయకులు మహేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట రంజిత్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు భామండ్లపల్లి అశోక్, రాకేష్, శరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.